క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్ తనిఖీ



ఎల్కతుర్తి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను హనుమకొండ సెంట్రల్ జోన్ డీసీపీ ఎస్‌కె.సలీమా గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఠాణాలోని రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫ్రెండ్లీ పోలీస్‌లో భాగంగా ప్రజలతో సత్సంబంధాలు ఉండాలని, సామాజిక సేవలో భాగంగా ప్రజలతో మమేకం కావాలని సూచించారు. మాదకద్రవ్యాలు, గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ఆమె వెంట కాజీపేట ఏసీపీ తిరమల్, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై రాజ్‌కుమార్ ఉన్నారు.

ప్రజాప్రతినిధుల సేవలు గొప్పవి

ఆత్మకూరు : నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఐదేళ్లపాటు సేవలందించిన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీల సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. దామెర ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, ఆత్మకూరు వైస్ ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం పూర్తయినందున గురువారం ఆయన నివాసగృహంలో ఘనంగా సన్మానించారు.

కేసు నమోదు

దామెర : పోలీసులపై అమర్యాదగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ నాయకుడు గురువారం సాయంత్రం వ్యక్తిగత పని నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. ఎస్సై మాట్లాడేందుకు సమయం ఇవ్వడం లేదంటూ అసహనం వ్యక్తం చేస్తూ ఆవేశానికిలోనై పోలీసులతో అమర్యాదగా ప్రవర్తించాడు. దీంతో కానిస్టేబుల్ హరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన రాంరెడ్డి

కమలాపూర్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీపీలు, ఎంపీటీసీల పదవీ కాలం ఈనెల 3న ముగియడంతో గురువారం నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. ఎంపీపీ స్థానంలో కమలాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రత్యేకాధికారిగా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.రాంరెడ్డిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు రాంరెడ్డి గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీఓ గుండె బాబు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందితో పాటు ఉపాధి హామీ సిబ్బంది ఆయన ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.

వేతనాలు అందించాలి

ఆత్మకూరు : గ్రామంలో ఏడాదిగా పనిచేసినా తమకు వేతనాలు అందడం లేదని, ఏడాదికిపైగా బకాయిలు ఉన్నాయని మండలంలోని కటాక్షపూర్ జీపీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. జీపీలో నిధులు లేవని తమకు వేతనాలు ఇవ్వడం లేదని వాపోయారు. కుటుంబ పోషణ భారంగా మారుతోందని అన్నారు. ఈ విషయంపై ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరగా సాంకేతిక సమస్య కారణంగా వేతనాలు ఇవ్వలేకపోయామని, త్వరలోనే చెల్లిస్తామని ఆయన తెలిపారు.

మరమ్మతు పనులు ప్రారంభం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని చెరువు కట్ట ప్రమాదకరంగా మారడంతో ఇటీవల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పరిశీలించి అధికారులతో మాట్లాడారు. కాగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు గురువారం చెరువు మరమ్మతు పనులను ప్రారంభించారు.

ప్రజల్లోనే ఉంటా..

వేలేరు : పదవి లేకున్నా నిత్యం ప్రజల్లోనే ఉంటానని మాజీ జెడ్పీటీసీ చాడ సరిత అన్నారు. గురువారం మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలో గల ఆమె స్వగృహంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేయగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఐదేళ్ల పాలనలో మండల అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింగరావు, మాజీ వైస్ ఎంపీపీ సంపత్, మాజీ ఎంపీటీసీలు జ్యోతి, సంధ్య, మాజీ సర్పంచ్‌లు ధర్మారెడ్డి, రవీందర్, మోహన్ నాయకులు పాల్గొన్నారు.

శానిటేషన్ అధికారిపై చర్య తీసుకోవాలి

పరకాల : పారిశుద్ధ్య సిబ్బందిని పురుష పదజాలంతో దూషిస్తున్న శానిటేషన్ అధికారి వెంకట్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పుల్లా రమేశ్ డిమాండ్ చేశారు. గత కొంతకాలంగా పారిశుద్ధ్య కార్మికులతో సానిటేషన్ అధికారి వెంకట్‌రెడ్డి వ్యవహరిస్తున్న తీరుపై మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు పట్టణంలోని అమరధామంలో పారిశుద్ధ్య కార్మికులు అత్యవసర సమావేశం ఏర్పాటు చేయగా ఆయన మాట్లాడారు. కార్మికులతో తన వ్యక్తిగత పనులు చేపిస్తున్నారని ఆరోపించారు.

కొట్టుకుపోయేందుకు సిద్ధంగా ఉన్న కమలాపూర్ పెద్ద చెరువు మత్తడి గోడ



ఉండేనా.. ఊడేనా..?

- ప్రమాదపుటంచున కమలాపూర్ చెరువు
- గతేడాది వర్షాలతో గండిపడిన మత్తడి
- మొరం, మట్టి తవ్వకాలతో కట్టకు పొంచిఉన్న ప్రమాదం
- పట్టించుకోని నీటిపారుదల శాఖ అధికారులు

కమలాపూర్ : కాకతీయుల కాలంలో సుమారు 445 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు కింద అధికారికంగా 1,272 ఎకరాలు, అనధికారికంగా 2 వేలకు పైగా ఎకరాల ఆయకట్టు ఉంది. కొన్నేళ్ల క్రితం చెరువులోని జీవరాశుల కోసం మత్స్య కార్మికులు చెరువు నీటిని వృధాగా వదిలితే, ఆ తర్వాత సరైన వర్షాలు పడకపోవడంతో చెరువు పూర్తిగా ఎండిపోయి సాగు, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆ చేదు జ్ఞాపకాలు మర్చిపోకముందే గతేడాది పూర్తిస్థాయిలో నిండి మత్తడి దూకిన చెరువు.. ప్రస్తుతం ఎండిపోయి నీటి లేమితో వెలవెలబోతోంది. ఇదే అదనుగా భావించిన కొందరు అక్రమార్కులు చెరువులోని మొరం, మట్టిని చెరువు మత్తడి, కట్టకు దగ్గరగా యదేచ్ఛగా తోడేశారు. గతేడాది కురిసిన భారీ వర్షాలకు చెరువు మత్తడికి గండి పడగా ఆ మత్తడికి సంబంధిత అధికారులు ఇప్పటి వరకు మరమ్మతు పనులు చేపట్టలేదు. దీంతో చెరువు తూము కాల్వలు సరిగా లేక ఆయకట్టు చివరి రైతులకు సాగు నీరందడం లేదు. మండలానికి పెద్ద దిక్కుగా ఉన్న ఈ చెరువును ప్రస్తుతం పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ సారి వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువు పూర్తిస్థాయిలో నిండితే మత్తడితో పాటు చెరువుకే పెను ప్రమాదం పొంచి ఉంది. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో కమలాపూర్ పెద్ద చెరువు ప్రమాదపుటంచుల్లో కొట్టుమిట్టులాడుతోంది.

గతేడాది గండి పడిన మత్తడి..

చెరువు కింద తమ పంట పొలాలు మునుగుతున్నాయనే నెపంతో గతంలో కొందరు రైతులు ఈ చెరువు మత్తడి రాళ్లను ఒకటి, రెండు వరుసలు తొలగించారు. దీంతో చెరువులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. దీనికితోడు గతేడాది జూలై 26న రాత్రి కురిసిన భారీ వర్షానికి చెరువు పూర్తిస్థాయిలో నిండి మత్తడి దూకగా, నీటి ఉధృతికి తట్టుకోలేక చెరువు మత్తడి దెబ్బతిని గండి పడింది. ఏడాది గడుస్తున్నా సంబంధిత శాఖ అధికారులు మత్తడికి మరమ్మతు పనులు చేపట్టలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఒకప్పుడు చెరువు పూర్తిస్థాయిలో నిండి మత్తడి దూకితే నాలుగు పసళ్లు పండటంతో పాటు మరో పంటకు సంబంధించి నారుమడులకు నీళ్లు సరిపడేవని రైతులు అంటున్నారు. కానీ ప్రస్తుతం చెరువు నిండితే రెండు పసళ్లకే సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బొందల గడ్డగా మారిన చెరువు..

గతేడాది మత్తడి దూకిన కమలాపూర్ పెద్ద చెరువు ఈ ఏడాది నీళ్లు లేక 90 శాతం వరకు ఎండిపోయింది. ఇదే అదనుగా భావించిన కొందరు అక్రమార్కులు పూడిక మట్టి పేరిట పగలంతా రైతులకు మట్టిని తరలించి రాత్రి సమయంలో మొరం మట్టిని అక్రమంగా తోడేశారు. దీంతో చెరువు కాస్తా బొందల గడ్డగా మారింది. చెరువు మత్తడి, కట్టకు సమీపంలో మొరం, మట్టి తోడేయడంతో ఈ ఏడాది భారీ వర్షాలు కురిస్తే మొత్తం మత్తడితో సహా చెరువు కట్టకు కూడా ప్రమాదం పొంచి ఉందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు ఇప్పటికైనా స్పందించి చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టి ఆయకట్టు రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

మత్తడి, కాల్వను బాగు చేయాలి



కమలాపూర్ పెద్ద చెరువులో నీళ్లుంటే జీవరాశులతో పాటు మా భూముల్లో రెండు పసళ్ల పంటలు సాగుచేసుకోవచ్చు. గతేడాది కురిసిన భారీ వర్షానికి చెరువు మత్తడికి గండి పడగా ఇప్పటి వరకు మరమ్మతులు చేయలేదు. ఈ సారి భారీ వర్షాలు కురిస్తే చెరువు మత్తడి, కట్ట ఆగే పరిస్థితి కనిపిస్తలేదు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పాలకులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు గండి పడిన మత్తడి, దెబ్బతిన్న తూము కాల్వలు బాగు చెయ్యాలె.

- మౌటం సాంబయ్య, రైతు కమలాపూర్

ప్రతిపాదనలు పంపించాం

భారీ వర్షాలకు దెబ్బతిని గండి పడిన కమలాపూర్ పెద్ద చెరువు మత్తడి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించాం. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాలేదు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే మత్తడి మరమ్మతులు పనులు చేపడుతాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- శశిభూషణ్, ఇరిగేషన్ ఈఈ



మొరం తోడడంతో చెరువులో ఏర్పడిన గుంతలు



వెలవెలబోతున్న కమలాపూర్ పెద్ద చెరువు



గండి పడి ధ్వంసమైన పెద్ద చెరువు మత్తడి గోడ

కాంగ్రెస్ పార్టీలో చేరిక



కమలాపూర్ : మండలానికి చెందిన మాజీ ఎంపీపీ తడక రాణి గురువారం బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన తమ అనుచరులు, కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ ఆధ్వర్యంలో భీమదేవరపల్లిలో జరిగిన చేరికల కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి కృషి చేస్తానని, కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని అన్నారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ.. అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తవుటం రవీందర్, బాలసాని రమేశ్‌గౌడ్, దేశిని ఐలయ్య గౌడ్, పర్శరాములుగౌడ్, శివగౌడ్, మాట్ల రమేశ్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ..

ఎల్కతుర్తి : మండలంలోని పెంచికలపేట గ్రామానికి చెందిన ముప్పు కుమార్ ఇటీవల అనారోగ్య బారిన పడగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ బాధితుడిని పరామర్శించారు. జీల్గుల గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కొక్కిర్ల అఖిల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కమలాపూర్ : మండలంలోని శనిగరంలో గొర్రెల పెంపకందారుల సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నన్నెవేన మొగిలి, ఉపాధ్యక్షుడిగా మేకల రవి, కార్యదర్శిగా కొడారి రాజేశ్, డైరెక్టర్లుగా కొడారి ఐలయ్య, వంగ తిరుపతి, కొడారి కుమారస్వామి, వంగ రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తమ ఎన్నికకు సహకరించిన జిల్లా నాయకులకు నూతన కార్యవర్గం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి

ఎల్కతుర్తి: స్వామినాథన్ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేసి రైతుల ఆదాయాన్ని రెంట్టింపు చేసే విధంగా చొరవ చూపాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో రైతులకు అప్పులు ఎక్కువై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో, రాష్ట్రంలో విద్యా, వైద్యం పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లిందని ఆరోపించారు. జులై 7న హనుమకొండలో నిర్వహించే సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశాలను నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు హాజరుకానున్నట్లు వెల్లడించారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు లక్ష్మణ్, నాయకులు రామచంద్రారెడ్డి, రమాదేవి, రవి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పదెకరాల వరకే రైతు భరోసా ఇవ్వాలి

ఎల్కతుర్తి : పదెకరాల భూమి కలిగిన రైతులందరికీ రైతుభరోసా అందించాలని సహకార సంఘం సభ్యులు తమ అభిప్రాయాలను తెలిపారు. గురువారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి, మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ సంఘం అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రైతుభరోసా పథకంపై అభిప్రాయాలు, సలహాల స్వీకరణ కార్యక్రమంలో పలువురు రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. పది ఎకరాలు వ్యవసాయ భూమి కలిగిన రైతుందరికీ రైతుభరోసా అందించాలన్నారు. సాగులో ఉన్న భూమికే రైతుభరోసా పథకం వర్తింపజేయాలని, ఉద్యోగులకు, ఇన్‌కామ్ టాక్స్ చెల్లింపుదారులకి, తెల్లరేషన్ కార్డు లేని వారికి, అసైన్డ్ భూములకు కూడా వర్తింప జేయాలని సభ్యులు సూచించారు. రైతులు తెలిపిన అభిప్రాయాలను ఉన్నత అధికారులకు నివేదించనున్నట్లు ఏడీఏ దామోదర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ అధికారి నాగేశ్వర్‌రావు, జిల్లా వ్యవసాయ సంచాలకుడు దామోదర్‌రెడ్డి, ఏఓ అబ్జల్‌పాషా, నోడల్ ఆఫీసర్ మనోహర్, సంఘం జనరల్ మేనేజర్ రామ్‌రెడ్డి, ఉపాధ్యాక్షుడు కడారి ఆదామ్, కార్యవర్గ సభ్యులు కనుకయ్య, జయ్‌పాల్‌రెడ్డి, భాగ్య, వీరయ్య, రాములు, మూగయ్య, కనుకమ్మ, రవీందర్‌రెడ్డి, మహేందర్, శ్రీనివాస్, బుచ్చయ్య, భాషు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : రైతు భరోసా పథకం అమలు కోసం నిర్వహిస్తున్న మహాసభల్లో రైతులు అందజేసిన సలహాలు, సూచనల మేరకే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని జిల్లా సహకార అధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మహాజన సభ నిర్వహించగా రైతులు మాట్లాడారు. ఐదెకరాలలోపు భూమి ఉండి పంటలు సాగు చేసే రైతులకే రైతు భరోసా ఇవ్వాలని, బీడు భూములకు రైతు భరోసా ఇవ్వొద్దని రైతులు తీర్మాణం చేసినట్లు తెలిపారు. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని నాగేశ్వర్‌రావు అన్నారు. వ్యవసాయ శాఖ ఏడీఏ కె.దామోదర్‌రెడ్డి, ఏఓ జాలి లక్ష్మారెడ్డి, నోడల్ అధికారి మతీన్ సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

‘నీట్’ లీకేజీపై విచారణ చేపట్టాలి



దామెర : మానవహారం చేపట్టిన డీవైఎఫ్‌ఐ నాయకులు

శాయంపేట : నీట్ పరీక్ష పేపర్ల లీకేజీపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎస్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు మారెపల్లి రఘువర్మ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్, నెట్ పరీక్షల లీకేజీపై విచారణ చేపట్టాలని ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్ సందర్భంగా గురువారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలను మూసివేయించారు. రఘువర్మ మాట్లాడుతూ.. ఎన్‌టీఏను రద్దు చేయాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లలో 65పేపర్ లీకేజీ ఘటనలు జరిగాయని, దీనిపై పార్లమెంట్‌లో ప్రధాని మోదీ చర్చించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ మండల ఉపాధ్యక్షులు కొమ్ముల వెంకటేష్, బిట్టు, లక్ష్మణ్, సన్ని, చరణ్, ప్రణయ్ పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : నీట్ అక్రమాలపై విచారణ జరిపించాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ కరీం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో విద్యా సంస్థల బంద్ ప్రశాంతంగా ముగిసింది.

దామెరలో..

దామెర : నీట్ ప్రవేశ ప్రశ్నపత్రం లీకేజీపై వెంటనే న్యాయవిచారణ జరిపించాలని ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో మానవహారం చేపట్టారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

- సీఐ రంజిత్‌రావు



మాట్లాడుతున్న సీఐ రంజిత్‌రావు

శాయంపేట : మండలంలోని యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ రంజిత్‌రావు అన్నారు. మండలంలోని వసంతాపూర్ గ్రామంలో గురువారం రాత్రి బాల్య వివాహాలు, మద్యం మత్తులో ప్రమాదాలు, సైబర్ నేరాలపై పోలీస్ కళాజాత బృంద ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ప్రతిఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగినట్లయితే పోలీసులకు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. గంజాయి, గుట్కా లాంటి మాదక ద్రవ్యాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోద్దని యువకులకు సూచించారు. మద్యం మత్తులోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ఎస్సై ప్రమోద్ కుమార్, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో మాసశివరాత్రి వేడుకలు



పట్నం వేస్తున్న ఒగ్గు పూజారులు



ప్రత్యేక అలంకరణలో మల్లికార్జున స్వామి

ఐనవోలు : ప్రఖ్యాత ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ మేరకు గురువారం ఉదయం నిత్యపూజల అనంతరం అర్చకులు స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపించారు. ఒగ్గు పూజారులు స్వామి వారికి ఎదురుగా నజరు పట్నం వేసి ఒగ్గు పూజలు నిర్వహించినట్లు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు మధుకర్ శర్మ, పండితులు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం



విలేకరులతో మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

కమలాపూర్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని, ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు గడుస్తున్నా విద్యా శాఖ మంత్రిని నియమించకపోవడం విడ్డూరంగా ఉందని బీజేపీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభమై 20 రోజులు దాటినా ఇప్పటి వరకు విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు ఇవ్వలేదని, మౌళిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రైవేట్ విద్యా సంస్థలు నోట్ బుక్స్, యూనిఫాం, ఇతరత్రా సామాగ్రిని అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి బండి కోటేశ్వర్, మండల ఉపాధ్యక్షుడు బోగి భిక్షపతి, ప్రధానకార్యదర్శి పెండ్యాల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డొడ్డి కొమురయ్యకు ఘన నివాళి

శాయంపేట, ఐనవోలు, ఎల్కతుర్తి, దామెర మండలాలతో పాటు జిల్లా వ్యాప్తంగా దొడ్డి కొమురయ్య వర్ధంతిని సీపీఐతో పాటు వివిధ కుల సంఘాల నాయకులు వేర్వేరుగా ఘనంగా నిర్వహించారు. కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- సాక్షి నెట్‌వర్క్



ఎల్కతుర్తి : నివాళులర్పిస్తున్న నాయకులు



దామెరలో..

ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

దామెర : ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈనెల 7న ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని మండల ఇన్‌చార్జ్ గోవిందు రవికుమార్ పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ల్యాదెళ్ల అధ్యక్షుడిగా సంగాల భరత్, ఉపాధ్యక్షుడి జగదీశ్, ప్రధానకార్యదర్శిగా చింతం ప్రభాకర్, కోశాధికారిగా సంగాల కుమారస్వామి, అధికార ప్రతినిధిగా చింతం రఘుపతి, ప్రచారకార్యదర్శిగా సంగాల సాయిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు రవికుమార్ నియామక పత్రాలను అందినంచారు. నాయకులు రవి, సుధాకర్, జేమ్స్, రాజు, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

పరకాల : అంగన్‌వాడీ సెంటర్‌లను పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలుగా మార్పించేందుకు ఐడీసీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 12 రోజుల శిక్షణ గురువారంతో ముగిసింది. 228 మంది అంగన్‌వాడీ ఉపాధ్యాయులను ఏడు గ్రూపులుగా విభజించి ఐసీడీఎస్ పరకాల సీడీపీఓ భాగ్యలక్ష్మి పర్యవేక్షణలో శిక్షణ ఇచ్చారు. సూపర్ వైజర్స్ హేమలత, పి.పద్మావతి పాల్గొన్నారు.

బంద్ సక్సెస్

ఎల్కతుర్తి: హనుమకొండ జిల్లా ఎంఎస్‌యూఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ పిలుపు మేరకు గురువారం భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో గల అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్ పాటించినట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.